క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కురవి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థిని స్వాతి జాతీయస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం బి.బాబు సోమవారం తెలిపాడు. పీఈటీ సుశీల, పీడీ అనిల్‌కుమార్‌ను అందినందించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ సునీత, అమర్సింగ్, వెంకన్న, రవి, మంగీలాల్, బాలరాజు, శారద పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు రాజేందర్‌గౌడ్..



నెహ్రూసెంటర్: మహాత్మ జ్యోతిబాపూలే నేషనల్ అవార్డుకు జిల్లా కేంద్రానికి చెందిన మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్‌గౌడ్ ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ సోమవారం తెలిపాడు. అవార్డుకు ఎంపికైన రాజేందర్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లో అందజేశారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ



గార్ల: రాష్ట్రస్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌లో గార్ల మండలం పుల్లూరు హైస్కూల్ విద్యార్థిని రేగుల సంజన అత్యంత ప్రతిభ కనబర్చింది. సదిష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను కోరుకున్న ప్రైవేట్ కళాశాలలో ఉచితంగా చదివిస్తారు. హెచ్ఎం సురేష్‌బాబు, ఉపాధ్యాయులు భూక్యా రమేశ్, రాంబాబు అభినందించారు.

వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శిగా తిరుపతి



గూడూరు: వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జిల్లా కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన రుద్ర తిరుపతిని నియమించినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్‌టీవీఎస్ జిల్లా అధ్యక్షుడిగా వీరేష్‌నాయక్

మహబూబాబాద్ అర్బన్: నవతెలంగాణ విద్యార్థి సంఘం (ఎన్‌టీవీఎస్) జిల్లా అధ్యక్షుడిగా ధరంసోత్ వీరేష్ నాయక్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బానోత్ రామన్ననాయక్ సోమవారం తెలిపాడు.

దరఖాస్తు అందజేత

గూడూరు: షెడ్యూల్డ్ ప్రాంతాల భూమి బదిలీ నిషేధ చట్టం 1959 ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఏ మండలాలల్లో ఏజెన్సీ గ్రామాలుగా ఉన్నాయి, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 1950 గెజిట్ ప్రకారం ఏ గ్రామాలు షెడ్యూల్ గ్రామాలుగా ఉన్నాయో రాత పూర్వకంగా ఇవ్వాలని కోరుతూ సోమవారం గూడూరు నాన్ ట్రైబల్ కన్వీనర్ కత్తి స్వామి ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రాకు దరఖాస్తు పత్రం అందజేశారు. కార్యక్రమంలో సురేందర్, ఉపేందర్, మల్లయ్య, నాగరాజు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

గూడూరు: మండలంలోని ఏపూరు గ్రామంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెఫర్డ్ , శ్రీ సత్య లయన్స్ చారిటబుల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌టీవీఎస్ రాష్ట్ర వ్యవస్థాపకుడు బానోతు రామన్న, వైద్యసిబ్బంది ఆంగోత్ అఖిల్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

భక్తి కానుకకు ముక్తి లేదా?

- భక్తులు సమర్పించిన గోవులకు రక్షణ కరువు
- తరచుగా రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత



రోడ్డుపై సంచరిస్తున్న గోవులు

మహబూబాబాద్ అర్బన్: భక్తులు దేవుళ్లకు సమర్పించిన గోవులను ఆలయ అధికారులు, పాలకులు ఏ మాత్రం సంరక్షించకుండా రోడ్లపైకి వదిలేస్తున్నారు. గోవులకు గడ్డిలేక ఆకలితో అలమటిస్తున్నాయి. దీంతో ఎన్నో జీవాలు మృత్యువాత పడ్డాయి. మరికొన్ని ఆవులు మేత దొరకక రోడ్లపై సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఈ మూగ జీవాలు రోడ్డుపై సంచరించడంతో కాలినడక, ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారికి వాటిని తప్పించబోయి తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలవుతున్నారు. రాత్రివేళల్లో ఇల్లెందు బైపాస్ వైఎస్సార్ సెంటర్ నుంచి నర్సంపేట రోడ్ రోడ్డు వరకు వీధి దీపాలు వెలగకపోవడం రోజు మరిచి రోజు నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ప్రమాదంలో కొందరు మృత్యువాత పడి చనిపోయిన సంఘటనలు చాలా వరకు ఉన్నాయి.

గోవులతో వ్యాపారం

ఆలయానికి సంబంధించిన గోవులు, రోడ్లపై తిరిగే మూగజీవాలను కొందరు అపరిచిత వ్యక్తులు అర్ధ రాత్రి వేళలో వాహనాల్లో సుదూర జిల్లాలకు తరలిస్తున్నారని పట్టణానికి చెందిన కొందరు వ్యక్తుల సహకారంతో ఇక్కడ గోవులు మాయమవుతున్నాయని జిల్లాలో వ్యాపారం చేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన గోవులను పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు బాగా క్యాష్ చేసుకుంటున్నారు. పట్టణంలో ఎక్కడ గృహ ప్రవేశాలు జరిగినా వారికి సమాచారం అందితే చాలు. గృహ ప్రవేశానికి మొదట గోవును ప్రవేశ పెడితే మంచిదంటూ.. ఉచిత సలహాలు ఇస్తూ.. వాటిని తీసుకెళ్లి గృహ ప్రవేశానికి రూ.వెయ్యి నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇంకొందరు వాటికి రోజు అన్నం, పండ్లు, కూరగాయలు పెట్టి రోజు వాటినుంచి వచ్చే పాలను విక్రయిస్తుంటారు. ఇలా ఆవులను ఎవరి ఇష్టానుసారంగా వారు నడుచుకుంటున్నారు. గోవులపై ప్రత్యేక దృష్టిసారించి సరైన రక్షణ కల్పించాలని, మృత్యువాత పడకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్/కురవి: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి హరినాయక్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఎదుట సోమవారం నిరసన చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో, సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద దళిత, గిరిజన పిల్లలు 19వేల మంది చదువుతున్నారు. ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలు రూ.175కోట్ల పెండింగ్‌లో ఉందన్నారు. బిల్లులు రాకపోవడంతో ప్రైవేట్ పాఠశాలలో బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థులను పాఠశాలలకు అనుమతించడం లేదని దీంతో పేద దళిత, గిరిజన పిల్లల చదువులకు నష్టపోతున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వీర బ్రహ్మచారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, వెంకన్న, జ్యోతిబస్సు, మహేందర్, వీరేందర్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

‘వరి కొయ్యలను ఎరువుగా మార్చుదాం’



పెద్దవంగర: బావోజీతండాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

పెద్దవంగర: వరి కోతలు పూర్తియ్యాక కొయ్యలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నడం ద్వారా ఎరువుగా ఉపయోగపడుతుందని మండల వ్యవసాయాధికారి స్వామి నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని బావోజీతండాలో వరికొయ్యలను కాలిస్తే జరిగే నష్టాలపై ఏఈఓ రాజుతో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తొర్రూరు ఏఎంసీ డైరెక్టర్ బానోతు గోపాల్ నాయక్, రాంసింగ్, గణేష్ పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: పంట కోసిన అనంతరం వరికొయ్యలను కాల్చవద్దని, దీంతో భూసారం తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి భాస్కర్ తెలిపారు. వరి కొయ్యలు కాల్చడం ద్వారా కలిగే నష్టాలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వెలికట్టలో రైతులకు అవగాహన కల్పించారు.

నెల్లికుదురు: వరికోతల అనంతరం రైతులు కొయ్యలను కాల్చితే చేస్తే భూసారం దెబ్బతింటుందని ఏఓలు షేక్ యాస్మిన్, బి.మహేందర్ రైతులకు సూచించారు. ఇనుగుర్తి, నెల్లికుదురు వివిధ గ్రామాలల్లో రైతుల వరి పంటలను సందర్శించి కొయ్యకాలపైన రైతులకు వారు అవగాహన కల్పించారు. వరికోత తర్వాత కొయ్యకాలును తగులబెట్టడం ద్వారా నేలలో సహజ పోషకాలు, సూక్ష్మజీవులతోపాటు భూసారం నశిస్తుందన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



బయ్యారం: కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం: మండలంలోని గంధంపల్లి, కొత్తపేట, నామాలపాడు గ్రామాల్లో ఐకేపీ, సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యంను విక్రయించి మద్దతు ధరతోపాటు బోనస్ పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఓ రాంజీ, ఐకేపీ ఏపీఎం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

బయ్యారం పెద్దచెరువు కట్టపై ఉన్న కట్టమైసమ్మ విగ్రహం వద్ద గుప్తనిధుల కోసం తవ్విన ప్రాంతంను ఎమ్మెల్యే పరిశీలించారు. కాకతీయరాజుల కాలంలో ఏర్పాటు చేసిన గుర్తులను చెరిపే విధంగా తవ్వకాలు జరపడం దురదృష్టకరమన్నారు. దోషులపై కఠిన చర్య తీసుకోవాలని ఎమ్మెల్యే పోలీస్ అధికారులకు సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

తొర్రూరు రూరల్: దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌లు కోరారు. మండలంలోని చెర్లపాలెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం చైర్మన్ తిరుపతిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మురళీ, స్థానికులు అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, ఎక్కటి నాగిరెడ్డి, వాసురెడ్డి, అనంతరెడ్డి, రామచంద్రు, నాగయ్య, రాంరెడ్డి, మహేష్, కర్ణాకర్ పాల్గొన్నారు.

మృతిపై విచారణ చేయించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కుక్కమూడి సురేష్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా సంయుక్త మండల కార్యదర్శి పైండ్ల యాకయ్య, వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశాడు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సురేష్ ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయన్నారు. సురేష్ సెల్‌ఫోన్ కాల్ డేటా, గుగుల్ డేటా ఆధారంగా న్యాయ విచారణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి రంగయ్య, నాయకులు శంకరయ్య, మంగా రమేశ్ పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 21న జిల్లా కేంద్రంలో జరగనున్న మహాధర్నాకు బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ వస్తున్నారని నాయకులు హాజరై విజయవంతం చేయాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మాజీ జెడ్పీటీసీ ఆంగోత్‌బిందు, తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అంజయ్య

మహబూబాబాద్ రూరల్: సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ 11నెలల పాలన విజయవంతమైన సందర్భంగా వరంగల్ నగరంలో మంగళవారం జరుగనున్న విజయోత్సవ సభను విజవంతం చేయాలని అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని మహిళా శక్తి పేరిట హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సభ ఏర్పాటు చేశారన్నారు. ఈ సమావేశంలో లక్ష్మీనారాయణ, వెంకట్ నాయక్, రాందాసు, శ్రీను, రవి, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని తొర్రూరు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్/జూనియర్ సివిల్ జడ్జి సరితను బదిలీ చేయాలని మానుకోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కీసర పద్మాకర్ రెడ్డి అన్నారు. న్యాయవాదులపై దురుసుగా ప్రవర్తించిన జడ్జి సరితను బదిలీ చేయాలని కోరుతూ మహబూబాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా పద్మాకర్ రెడ్డి, న్యాయవాదులు గంధసిరి ఉప్పలయ్య, నలుసాని ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించి జడ్జి సరితను తక్షణమే బదిలీ చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు యసాడి చెన్నమల్లారెడ్డి, మామిడాల సత్యనారాయణ, పుల్లూరు కృష్ణయ్య, దర్శనం రామకృష్ణ, సుమన్, మహేందర్, సురేష్ పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం లంబాడీలపై దాడులు, అక్రమ అరెస్టులు చేయడం ప్రభుత్వ పరాకాష్టకు నిదర్శనమని లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు హరినాయక్, లక్ష్మణ్ నాయక్, భీమానాయక్, రమేశ్ అన్నారు. సమితి ఆధ్వర్యంలో చలో కొడంగల్ పిలుపులో భాగంగా అక్కడికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న సంఘం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు.

ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న మురళీకృష్ణ

మరిపెడ: ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. సోమవారం మరిపెడ మండల 11వ మహాసభ మండల కేంద్రంలోని హార్ట్‌ఫుల్ సెంటర్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయ సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాకుబ్, జిల్లా కార్యదర్శులు నామ వెంకటేశ్వర్లు, నంగిగామ జనార్దనాచారి, సంఘం నాయకులు రాంచంద్రు, మురళీకృష్ణ, గోవర్ధన్, సీహెచ్ ప్రభాకర్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘తప్పుడు ప్రచారాలు మానుకోవాలి’

గార్ల: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుంటే, బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ, అభివృద్ధిని అడ్డుకుంటూ దాడులు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, మాజీ ఎంపీపీ ఎం వెంకట్‌లాల్, బానోత్ హతీరాంనాయక్, యాకూబ్‌పాషా, వీరస్వామి, రాజశేఖర్, గోపె వెంకటేశ్వర్లు, భీముడు, బాబు, నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హాస్టల్ భవనాలను కేటాయించాలి

చిన్నగూడూరు: మండలంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టల్ భవనాలను వారికి కేటాయించాలని లేని తరుణంలో అధికారులు స్పందించకపోతే నిరహార దీక్షకు సిద్ధమవుతానని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పెద్దబోయిన వీరబాబు డిమాండ్ చేశాడు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టల్ భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, ఉదయ్, ప్రణయ్, సందీప్, నిఖిల్, సుధీర్, జస్వంత్ పాల్గొన్నారు.

ఇసుక డంపు సీజ్

నర్సింహులపేట: మండలంలోని కౌసల్యదేవిపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపాడు. ఆకేరు వాగు నుంచి అక్రమంగా కౌసల్యదేవిపల్లి శివారులో ఇసుకను నిల్వ చేశారనే సమాచారంతో సోమవారం రెవెన్యూ, పోలీసులు తనిఖీ చేయగా అక్కడ ఉన్న ఇసుక డంపును సీజ్ చేశామన్నారు.

పొట్టనుంచి చెడు నీరు తొలగింపు

గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో ఆయాసంతో ఇబ్బంది పడుతూ వచ్చిన కాలేయ వ్యాధిగ్రస్తుడి పొట్టలో నుంచి వైద్యుడు హనుమంతరావు 2లీటర్ల చెడునీరును తొలగించి రోగికి ఉపశమనం కల్పించాడు. మండలం లోని పుల్లూరు గ్రామానికి చెందిన కాలేయ వ్యాధిగ్రస్తుడు కొన్ని నెలల నుంచి పొట్ట ఉబ్బడంతో ఇబ్బంది పడుతూ సోమవారం ఆస్పత్రికి వచ్చాడు. రోగికి వైద్య పరీక్షలు చేసిన అనంతరం డాక్టర్, వైద్యసిబ్బంది కలిసి పొట్టలో నుంచి సుమారు 2లీటర్ల చెడు నీటిని తొలగించారు.

ఆలయ వార్షికోత్సవ పూజలు

మరిపెడ రూరల్: మండలంలోని తాళ్లఊకల్ ఉమామహేశ్వర ఆలయం 3వ వార్షికోత్సవాన్ని భక్తుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ దంపతులు చాపల యాదగిరిరెడ్డి రజిత, చాపల శ్రీనివాస్‌రెడ్డి రమ, బొలగాని శ్రీనివాస్ నాగమణి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


తొర్రూరు: గర్భిణులు విధిగా పోషకాహారం తీసుకోవాలని తొర్రూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు అన్నారు. పెద్దవంగర లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు పోషకాహార వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, వైద్యులు పాల్గొన్నారు.

సన్మానం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేందర్, ఉషోదయ వాకర్స్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య, సభ్యులు సీపీఎం జిల్లా కార్యదర్శిగా మూడోసారి ఎన్నికైన సాధుల శ్రీనివాస్‌ను సోమవారం వాకర్స్ సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్‌టీఓ అధ్యక్షులు వడ్డెబోయిన శ్రీనివాస్, వాకర్స్ సుధాకర్‌రెడ్డి, సంజీవ, శ్రీనివాస్, రంగన్న, భాస్కర్, వేణు, మార్కండేయులు పాల్గొన్నారు.

సాగుపై అవగాహన పెంచుకోవాలి



కేసముద్రం: పంటల సాగుపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని కల్వల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వరంగల్, కేవీకే మల్యాల ఆధ్వర్యంలో సోమవారం రైతు సదస్సు నిర్వహించారు. అగ్రికల్చర్ విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్‌లు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వరంగల్ అగ్రికల్చర్ కళాశాల డీన్ బలరాం, ఏఓ వెంకన్న, కేవీకే మల్యాల కోఆర్డినేటర్ మాలతి, శాస్త్రవేత్త రాంబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

మహబూబాబాద్ అర్బన్: పుస్తకాలు, పాటలు ప్రజల చైతన్య దీపకని సినిగేయ రచయిత, ప్రముఖ కవి కందుల ప్రేమ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ 57వ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత, లైబ్రరియన్స్ విజయేందర్, రవి, వీరేందర్, భూలక్ష్మి పాల్గొన్నారు.

సమగ్రచట్టం అమలు చేయాలి

చిన్నగూడూరు: వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని ఏఐపీకేఎంఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు బండపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం మండలంలోని గుండంరాజుపల్లిలో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మహేందర్, శ్రీనివాస్, లింగయ్య, వెంకటేశ్వర్లు, జానీ, నారాయణ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కులంగా గుర్తించాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్టోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యలయంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటచారీ, శంకర్, సత్యమనోహరమ్మ, వెంకటేశ్వర్లు, సోమనరయ్యచారి, నాగేంద్రాచారీ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని ముడుపుగల్ గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ పట్టణానికి చెందిన సంధ్య, ఆమె మరొక బంధువు ముడుపుగల్ గ్రామంలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ఓ ద్విచక్రవాహనంపై లిఫ్ట్ తీసుకొని వస్తున్నారు. కొంత దూరం వచ్చాక బైక్ అదుపుతప్పి పక్కకు పడిపోయింది. సంధ్యకు తీవ్ర గాయాలుకాగా మరో మహిళకు స్వల్పగాయాలయ్యాయి. 108లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. సంధ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకువెళ్లారు.

దాడి కేసులో ఒకరికి జైలు

మరిపెడ రూరల్: ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన కేసులో ఒకరికి తొర్రూరు కోర్టు జైలు శిక్ష విధించింది. ఎస్సై సతీష్ కథనం ప్రకారం.. మండలంలోని గాలివారిగూడెం గ్రామానికి చెందిన ఎడెల్లి భిక్షంకు అదే గ్రామానికి చెందిన ఎడెల్లి కృష్ణ ప్రభుత్వం అందించే పంట నష్టపరిహారం రాకుండా లిస్ట్‌లో భిక్షం పేరు లేకుండా చేశాడు. ఈ విషయంపై బాధితుడు భిక్షం కృష్ణను నిలదీయడంతో ఇరువురి మధ్య ఘర్షణ వాతవరణం చోటు చేసుకుంది. ఈక్రమంలో భిక్షంపై కృష్ణ కర్రతో దాడి చేయగా ఎడమ కాలు విరిగింది. ఈ విషయంపై బాధితుడి భార్య ఎడెల్లి సుభద్ర ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టి ఎస్సై సతీష్ తొర్రూరు కోర్టు రిమాండ్ చేశాడు. దాడికి పాల్పడ్డ సదరు వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపాడు.

కారు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

తొర్రూరు: పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న యువకుడిని కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలైన ఘటన సోమవారం రాత్రి మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాంచారిమడూరు గ్రామానికి చెందిన శీల యాకన్న తొర్రూరులోని ప్రైవేటు పాఠశాలలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రోజువారీగా విధులు ముగించుకుని గ్రామ శివారులోని తన డబుల్ బెడ్రూం ఇంటికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈఘటనలో యువకుడి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఎస్సై రాంజీనాయక్ వివరాలు నమోదు చేసుకున్నారు.

ఒకరి రిమాండ్

నర్సింహులపేట: మండలంలోని కౌసల్యదేవిపల్లి ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా ట్రాక్టర్‌ను పీఎస్‌కు తరలిస్తున్న సందర్భంగా జరిగిన ఘటనలో రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదుతో నమోదైన కేసులో సోమవారం అనిల్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపాడు.

వేప చెట్ల బెరడు తొలగింపు.. ఒకరి అరెస్టు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని మల్యాల గ్రామంలో గల జెన్నారెడ్డి వెంకటరెడ్డి ఉద్యాన పరిశోధన స్థానం పరిధిలోని 12 వేప చెట్ల బెరడును తొలగించిన ఘటనలో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై గంద్రాతి సతీష్ సోమవారం తెలిపారు. మల్యాల గ్రామంలోని జేవీఆర్ హెచ్ఆర్ఎస్ జేవీఆర్ హెచ్ఆర్ఎస్ పరిధిలోని సుమారు 12వేప చెట్లకు ఉన్న బెరడును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించగా, జేవీఆర్ హెచ్ఆర్ఎస్ శాస్త్రవేత్త అడ్లూరి ప్రశాంత్ ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా మల్యాల గ్రామానికి చెందిన గడ్డమీది వీరయ్య అనే వ్యక్తి వేపచెట్ల బెరడును సుమారు 4 అడుగుల మేరకు తొలగించాడన్నారు. వాటి విలువ సుమారు రూ.3లక్షల వరకు ఉంటుందని, వీరయ్యను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని పేర్కొన్నారు.

చెరువులకు మరమ్మతులు చేపట్టాలి



నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో భారీ వర్షాలకు తెగిపోయిన చెరువు, కట్టలకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయ్‌సారథి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ధర్నా చేపట్టి ర్యాలీ నిర్వహించి స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెగిపోయిన చెరువు కట్టలను పునర్ నిర్మించి నష్టపోయిన రైతులు, మత్స్యకారులు, ఇల్లు కోల్పోయిన నిరుపేద బాధిత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అజయ్ సారథి, వెంకన్న, స్వామి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, చిర్ర వెంకన్న పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలు అందించాలి

మహబూబాబాద్ రూరల్: వైద్యులు గర్భిణీలకు కావలసిన ఆరోగ్య సేవలు అందించాలని మెటర్నల్ చైల్డ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం అన్నారు. మండలంలోని కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం మెటర్నల్ చైల్డ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం సందర్శించి పరిశీలించారు. వైద్యాధికారి మౌనిక, హెల్త్ ఎడ్యుకేటర్ రాజు పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

పెద్దవంగర: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మండల పరిధిలోని చిన్నవంగరలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన భోదేవపల్లి అశోక్ వ్యవసాయ పనుల నిమిత్తం ఉదయం పొలం వద్దకు ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా వెళ్లారు. అశోక్ కుమారుడు వంశీ స్కూల్ వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగల గొట్టి ఉంది. సమాచారం తల్లిదండ్రులకు చేరవేయగా ఇంటికి చేరుకున్న తండ్రి చూడగా బీరువాలో తులాల పుస్తెలతాడు, 18 గ్రాములు బుట్టాలు, 30తులాల పట్టీలతోపాటు పలు నగలు చోరీకి కాగా రూ.2.22 లక్షలు అపహరణకు గురైనట్లు బాధితుడు అశోక్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.